సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం ၊ 27 ၊ జూలై ၊ 2024



టన్ను చీనీ రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు పలికాయి. మార్కెట్‌కు 1,118 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.25
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టంగా రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.1°/22.5°
జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. గంటకు 10 నుంచి 18 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

యాదగిరి రైల్వేస్టేషన్‌లో 'వందేభారత్' హాల్ట్

గుంతకల్లు: బెంగళూరు–కలబుర్గి మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ యాదగిరి రైల్వేస్టేషన్‌లో నిలుపుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు గుంతకల్లు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం మనోజ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వందేభారత్ రైలు బెంగళూరు జంక్షన్ నుంచి (22232) బయలుదేరి యాదగిరి రైల్వేస్టేషన్‌కు రాత్రి 9.44 గంటకు చేరుతుందని పేర్కొన్నారు. ఇక కలబుర్గి జంక్షన్ నుంచి (22231) యాదగిరి రైల్వేస్టేషన్‌కు ఉదయం 5.54 గంటలకు చేరుతుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిలమత్తూరులో హైఅలర్ట్

- నేడు మండల సర్వసభ్య సమావేశం
- భారీ పోలీసు భద్రతతో నిర్వహించేలా చర్యలు

చిలమత్తూరు: ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో చిలమత్తూరులో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ నెల 24వ తేదీన జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడటం, సర్వసభ్య సమావేశంలో తమపై దాడికి కొందరు ప్లాన్ చేశారని ఎంపీపీ, వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు పోలీసులను ఆశ్రయించిన ఘటనలు ప్రకంపనలు సృష్టించాయి. ఈ క్రమంలో ఎంపీపీ పురుషోత్తమ రెడ్డి ఆధ్యక్షతన శనివారం నిర్వహించనున్న సర్వసభ్య సమావేశం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

అప్రమత్తమైన పోలీసులు..
ఈనెల 24వ తేదీన ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉండగా, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులపై టీడీపీ నేతలు నాగరాజు, బాబురెడ్డి తదితరులు తమ అనుచరులతో దౌర్జన్యానికి దిగడంతో పోలీసులు ఎంపీపీని ఆరోజు హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 27వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు తమకు భద్రత కల్పించాలని పోలీసులను కోరడంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. గట్టి భద్రత మధ్య మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలని భావిస్తోంది. ఇందుకోసం భారీగా పోలీసులను మోహరించేందుకు సిద్ధమయ్యారు. సభ్యులు కాని వారిని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోకి వెళ్లకుండా చూడటం, ఘర్షణకు ఆస్కారం లేకుండా సమావేశం కొనసాగేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

గురుకులాల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

నల్లమాడ: ఏపీ సాంఘిక సంక్షేమ(అంబేడ్కర్) గురుకుల పాఠశాలల్లో (2024–25 విద్యా సంవత్సరం) ఇంటర్ మొదటి సంవత్సరం ఆర్ట్స్ గ్రూపుల్లో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో 360పైబడి మార్కులు సాధించిన విద్యార్థినులు ప్రవేశ పరీక్షతో సంబంధం లేకుండా నేరుగా దరఖాస్తు సమర్పించి అడ్మిషన్ పొందవచ్చని ఉమ్మడి అనంతపురం జిల్లా గురుకులాల సమన్వయ అధికారి అంగడి మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరవకొండ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో సీఈసీ గ్రూపులో 2, ఎంఈసీలో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే బ్రహ్మసముద్రం బాలికల కళాశాలలో సీఈసీలో 8, హెచ్ఈసీలో 10, నల్లమాడ బాలికల గురుకుల కళాశాలలో సీఈసీ గ్రూపులో 6, హెచ్ఈసీలో 35 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ధర్మవరంలో డాక్టర్ నాగప్రసాద్ నిర్వహిస్తున్న 'స్కంద క్లినిక్'



హిందూపురంలో డాక్టర్ నరేంద్రకుమార్ నడుపుతున్న విజయ ఆస్పత్రి



హిందూపురంలో డాక్టర్ వెంకటరమణనాయక్ నడుపుతున్న జతిన్ క్లినిక్

డాక్టర్లకు ప్రైవేటు పైత్యం

☛ నాలుగు రోజుల క్రితం కదిరి మున్సిపాలిటీలో ఇరువురు ఘర్షణ పడ్డారు. మాటా మాటా పెరిగి దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో నిజాం వలి అనే వ్యక్తి గాయపడగా.. స్థానికులు అతన్ని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో నర్సులు తాము వైద్యం చేయలేమని చెప్పారు. అనంతరం పోలీసులు వచ్చి వైద్యం చేయాలని డిమాండ్ చేయగా.. అరకొర వైద్యం చేశారు. పక్కనే ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలని సూచించినట్లు బాధితుడు నిజాం వలి పేర్కొన్నాడు.

☛ వారం రోజులుగా హిందూపురంలోని జిల్లా ఆస్పత్రికి రోజూ సగటున వెయ్యి మంది రోగులు వస్తున్నారు. అయితే సమయానికి వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. అక్కడ పని చేసే సిబ్బందిని అడిగితే.. డాక్టర్లు వచ్చే వరకు వేచి ఉండాలని.. లేకపోతే ఆ పక్కనే ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే ఉంటారని సమాధానం చెబుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

... జిల్లాలోని చాలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టులన్నీ భర్తీ చేసి నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంది. కానీ రెండు నెలలుగా పర్యవేక్షణ కొరవడటంతో వైద్యులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. విధులకు ఇలా వచ్చి అలా వెళ్తూ... 'ప్రైవేటు'లో తరిస్తున్నారు.

సాక్షి, పుట్టపర్తి

అసలే వర్షాకాలం.. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం. ఇప్పటికే జ్వరపీడితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. సొంతంగా నిర్వహించే ప్రైవేటు క్లినిక్‌లలోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రైవేటు వైద్యం చేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు.



నాడి పట్టేవారే లేరు!
- ఆస్పత్రుల్లో ఖాళీలన్నీ భర్తీ చేసిన జగన్ సర్కార్
- రెండు నెలలుగా వైద్యులపై పర్యవేక్షణ కరువు
- ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉండని డాక్టర్లు
- క్లినిక్‌లలో సేవలందిస్తూ జేబులు నింపుకుంటున్న వైనం
- అత్యవసర పరిస్థితుల్లో నర్సుల సేవలే దిక్కు
- ప్రైవేట్ క్లినిక్‌కు వెళ్లాలని సిబ్బంది ఉచిత సలహా

గట్టిగా నిలదీస్తే 'భోజనం' అంటూ సాకు..
జిల్లాలో ఏడు సీహెచ్‌సీలు, 45 పీహెచ్‌సీలు, 18 యూపీహెచ్‌సీలు, రెండు పీపీ యూనిట్లు, ఒక టీబీ క్లినిక్, రెండు కో–లొకేటెడ్ క్లినిక్‌లు, రెండు ఏరియా ఆస్పత్రులు, ఒక జిల్లా ఆస్పత్రి ఉంది. వీటి ద్వారా నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సి ఉంది. కానీ హిందూపురం, ధర్మవరం, కదిరి పట్టణాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే వైద్యులందరూ ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు నర్సులే వైద్యం చేయాల్సిన పరిస్థితి. డాక్టర్ ఎక్కడని... ఎవరైనా గట్టిగా నిలదీస్తే భోజనానికి వెళ్లారు.. మరి కాసేపట్లో వస్తారని అక్కడి సిబ్బంది సమాధానం చెబుతున్నారు. అత్యవసర విభాగంలోనూ వైద్యులు సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని తెలుస్తోంది. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తే రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తారని.. ఉచితంగా వైద్యం లభిస్తుందని ప్రభుత్వాస్పత్రికి వస్తే వైద్యులు అందుబాటులో ఉండటం లేదని రోగులు వాపోతున్నారు.



హిందూపురం జిల్లా ఆస్పత్రిలో రోగుల రద్దీ

139	జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల సంఖ్య (రిజిస్టర్డ్)
64	ల్యాబ్‌ల సంఖ్య
66	జిల్లా పరిధిలోని స్కానింగ్ సెంటర్లు

వైద్యులు ఉన్నా.. వైద్యం సున్నా..
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది పోస్టులన్నీ భర్తీ చేసింది. అప్పట్లో అందరూ సక్రమంగా పని చేసేలా పర్యవేక్షణ ఉండేది. ఫలితంగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేవి. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. ఏ రోగంతో ఆస్పత్రికి వెళ్లినా.. పట్టించుకునే నాథుడు కరువయ్యారని రోగులు బాధపడుతున్నారు. భారీగా డబ్బులు చెల్లించి.. ప్రైవేటుగా చికిత్స చేయించుకోలేక.. స్థానిక మెడికల్ షాపుల్లో దొరికే మందుబిళ్లలు మింగుతూ వారాల తరబడి ఇంటి వద్దనే ఉంటున్నట్లు చెబుతున్నారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఫ్యామిలీ డాక్టర్ విధానం, ఆరోగ్య సురక్ష, విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా పల్లె.. పల్లెలోనూ వైద్యసేవలు అందుబాటులో ఉండేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తోన్న ప్రభుత్వ వైద్యులు

- కదిరి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మున్వర్ హుస్సేన్.. 'హుస్సేన్ క్లినిక్' పేరుతో ప్రైవేటు ఆస్పత్రి నిర్వహిస్తున్నారు.
- ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ నాగప్రసాద్ పాత బస్టాండు వద్ద 'స్కంద క్లినిక్' నిర్వహిస్తున్నారు.
- ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో పని చేసే డాక్టర్ ఇందురేఖ మరోచోట శివరామ్ క్లినిక్ పేరుతో సొంత ఆస్పత్రి నిర్వహిస్తున్నారు.
- హిందూపురం జిల్లా ఆస్పత్రిలో సర్జన్‌గా పని చేసే డాక్టర్ వెంకటరమణనాయక్.. ఆర్‌పీజీటీ రోడ్డులో జతిన్ క్లినిక్ పేరుతో ప్రైవేటు ఆస్పత్రి నిర్వహిస్తున్నారు.
- హిందూపురం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ భాస్కర్‌రెడ్డి.. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రీనివాస నర్సింగ్ హోమ్ నిర్వహిస్తున్నారు.
- హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ డాక్టర్ జక్కా నరేంద్రకుమార్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని విజయ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు.
- ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్న పిల్లల డాక్టర్ ఆఫ్తాబ్ ఆర్‌పీజీటీ రోడ్డులో న్యూ ఫారియా క్లినిక్ నిర్వహిస్తున్నారు.
- హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్ తన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పెనుకొండలో ఆర్ఆర్ క్లినిక్ ఏర్పాటు చేసుకున్నారు.
- గైనకాలజిస్టు బాబా బుడెన్.. ఆస్పత్రికి కూతవేటు దూరంలో ప్రైవేటుగా అమ్మ క్లినిక్ నిర్వహిస్తున్నారు.

డ్యూటీ కాల్ వస్తే వెళ్లాల్సిందే



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే వైద్యులు చాలా మంది ప్రైవేటు క్లినిక్‌లు నిర్వహిస్తున్న మాట వాస్తవమే. అయితే పని వేళల్లో కచ్చితంగా విధిలో ఉండాల్సిందే. డ్యూటీలో సమయపాలన తప్పనిసరి. విధులకు డుమ్మా కొట్టే వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. బయోమెట్రిక్ ప్రకారం హాజరు ఉంటుంది. తప్పిదాలు జరిగితే చర్యలకు ఆదేశిస్తాం. ఏ ఆస్పత్రిలో అయితే డాక్టర్లు విధులకు డుమ్మా కొడతారో.. అక్కడి సూపరింటెండెంట్‌తో చర్చించి చర్యలు తీసుకుంటాం. పని వేళలు ముగిసిన తర్వాత కూడా ఫోన్ కాల్ వస్తే మళ్లీ వెళ్లి విధులు నిర్వర్తించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క వైద్యుడిపై ఉంటుంది.

– డాక్టర్ తిప్పేంద్ర నాయక్, డీసీహెచ్ఎస్

యువతలో నైపుణ్యాలు పెంపొందించాలి

- శిక్షణతో ఉపాధి మార్గం చూపాలి
- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: పారిశ్రామిక అవసరాలకు తగ్గ నైపుణ్యాలు ఉంటేనే ప్రస్తుతం ఉద్యోగాలు దక్కే పరిస్థితి ఉందని, అందువల్ల యువతకు నైపుణ్యాలు పెంచుకునేలా శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నిరుద్యోగ యువతకు నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. డిమాండు ఉన్న కోర్సులను ప్రవేశపెట్టాలన్నారు. అలాగే స్థానిక శ్రామికశక్తిని బలోపేతం చేయడానికి, ఉపాధిని మెరుగుపరచడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలోని పరిశ్రమలు, కంపెనీలు, వ్యాపార సంస్థలను సంప్రదించి వారి అవసరాలకు అనుగుణంగా ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కోర్సులు చేసిన వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, కార్పెంటర్, డేటా ఎనలిస్ట్, అకౌంట్స్, మేకప్ ఆర్టిస్ట్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, రికవరీ ఏజెంట్, జేసీబీ డ్రైవర్, అసిస్టెంట్ సర్వేయర్ తదితర వాటిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ అబ్దుల్ ఖయ్యూం, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఎల్‌డీఎం రమణకుమార్, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, కియా కంపెనీ ప్రతినిధి రవిశంకర్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, మెప్మా ప్రతినిధి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు డివిజన్ అభివృద్ధికి సహకారం



డివిజనల్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

- కంట్రోల్ కార్యాలయాన్ని ప్రారంభించిన రైల్వే జీఎం

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. గుంతకల్లు డివిజన్ పర్యటనలో భాగంగా శుక్రవారం గుంతకల్లుకు వచ్చిన ఆయనకు డీఆర్ఎం ఎం.విజయ్‌కుమార్, ఏడీఆర్ఎం సుధాకర్ స్వాగతం పలికారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో వివిధ విభాగాలకు చెందిన డివిజన్ స్థాయి అధికారులతో సమీక్షించారు. దాదాపు రూ.30 కోట్లతో నూతనంగా నిర్మించిన డివిజనల్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,131 కోట్లకు పైగా నిధులు కేటాయించారని తెలిపారు. కొత్త రైళ్ల ఏర్పాటుపై విలేకరులు ప్రశ్నించగా.. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా డిమాండ్ ఉన్న ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జోనల్ ఏజీ పటేల్, సీనియర్ డీఈఎన్ కో–ఆర్డినేషన్ జీబీఎస్ శ్రీనివాస్, సీనియర్ డీఓఎం ఎం.శ్రావణ్‌కుమార్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీపీఏ జయశంకర్ చౌహాన్, సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్, ఆర్‌పీఎఫ్ కమిషనర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైల్వే జీఎం గుంతకల్లు–డోన్–కర్నూలు సెక్షన్‌లో ప్రత్యేక రైల్లో ప్రయాణించి.. రైలు మార్గం పటిష్టతను పరిశీలించారు.

పోలీసులు ఆదర్శంగా ఉండాలి



గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వి.రత్న



దర్బార్‌లో కానిస్టేబుల్ సమస్య వింటున్న ఎస్పీ

- పరేడ్ పరిశీలనలో ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: పోలీసు శాఖలోని ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలుగుతూ అందరికీ ఆదర్శంగా నిలవాలని ఎస్పీ రత్న సూచించారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్, స్పెషల్ పార్టీ సిబ్బంది, హోంగార్డులు, పుట్టపర్తి అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని పోలీస్ సిబ్బందికి పరేడ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రత్న ఏఆర్, హోంగార్డుల ప్లటూన్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పరేడ్ క్రమశిక్షణకు నిదర్శనమని, దీనివల్ల నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశం ఉందన్నారు. అలాగే సిబ్బందిలో ఐకమత్యం ఏర్పడేందుకు దోహదం చేస్తుందన్నారు. అందువల్ల ప్రతి పోలీస్ నెలలో కనీసం రెండు సార్లు పరేడ్‌కు హాజరు కావాలన్నారు. సమాజంలో పోలీసులకు ప్రత్యేక స్థానం ఉందని, దాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ నైతిక విలువలు, క్రమశిక్షణ పాటించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. విధి నిర్వహణలో చిన్న, చిన్న అవాంతరాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా ముందుకు సాగాలన్నారు. విధి నిర్వహణలో ఉత్సాహంగా ఉన్నప్పుడే సమాజం, కుటుంబం శాంతియుతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు చంద్రశేఖర్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..
పోలీసులు విధి నిర్వహణలో ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎస్పీ రత్న తెలిపారు. పోలీసు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. శుక్రవారం ఆమె పరేడ్ గ్రౌండ్‌లో 'పోలీస్ దర్బార్' నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పోలీసులతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలు ఓపికగా విని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమస్యలు విన్నవించుకోలేనివారు ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేస్తామని అందులో వేయాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఎస్ఐలు త్యాగరాజునాయుడు, రామకృష్ణ, లక్ష్మీపతిలను ఎస్పీ రత్న పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

క్లుప్తంగా

ఎస్‌బీఐ సేవాకేంద్రంలో చోరీ



ధ్వంసమైన షట్టర్

హిందూపురం అర్బన్: స్థానిక నానెప్ప నగర్ రైల్వే రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ వినియోగదారుల సేవా కేంద్రంలో చోరీ జరిగింది. గురువారం రాత్రి పొద్దుపోయిన తర్వాత షట్టర్‌ను ఇనుప రాడ్‌తో ఎత్తి దుండగులు లోపలకు ప్రవేశించి, రూ.లక్ష నగదు అపహరించుకెళ్లారు. చోరీ విషయాన్ని శుక్రవారం ఉదయం గుర్తించిన నిర్వాహకుడు రమేష్ ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బీటెక్ ఫలితాల విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, తదితరులు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన బీటెక్ ఒకటో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–23) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ శుక్రవారం ఉదయం విడుదల చేశారు. ఫలితాల కోసం కళాశాల అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.లలిత కుమారి, విభాగాధిపతులు డాక్టర్ జి.మమత, ప్రొఫెసర్ భువనవిజయ, డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ కళ్యాణి రాధ, డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, డాక్టర్ దిలీప్, అజిత తదితరులు పాల్గొన్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

హిందూపురం: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.హరీష్ బాబు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష రాకపోయిన పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. స్పాట్ అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబిత, టీసీ, 4 నుంచి 10వ తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, 2 ఫొటోలు, ఆధార్ కార్డు ఒరిజినల్‌తోపాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకెళ్లాలి. స్పాట్ అడ్మిషన్ కోసం రూ.6,500 ఫీజు చెల్లించాలి. స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు.

భవిత కేంద్రాల మూత!

- టీడీపీ సర్కార్ వైఖరితో రూ.లక్షల ప్రజాధనం వృథా
- అగమ్య గోచరంగా బుద్ధిమాంద్య పిల్లల భవిత

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రంలో చంద్రబాబు సర్కార్ ఏర్పాటైన తర్వాత జిల్లాలోని భవిత కేంద్రాలు మూతపడ్డాయి. ఫలితంగా బుద్ధిమాంద్య పిల్లల భవిత అగమ్య గోచరంగా మారింది. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాలోని 32 మండలాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల వనరుల కేంద్రాలు(భవిత)ను 2015లో నిర్మించారు. ఒక్కో భవనానికి రూ.12 లక్షల చొప్పున ప్రభుత్వం వెచ్చించింది. 2019లో జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత భవిత కేంద్రాలకు మహర్దశ చేకూరింది. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు చదువుతో పాటు ఆటపాటలు, ఫిజియోథెరపి, ఇతర వైద్య సదుపాయాలను క్రమం తప్పకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పిస్తూ వచ్చింది. భవిత కేంద్రాల పనితీరు మెరుగు పడడంతో చాలా మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో మార్పులు వచ్చాయి. ప్రస్తుతం వారు ప్రభుత్వ పాఠశాలల్లో చేరి విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు.

విలీన ప్రక్రియతో అవమానాలు..

రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ అవసరం లేదని, వారిని ప్రభుత్వ పాఠశాలల్లోనే ఓ మూల కూర్చొబెట్టి ఆటపాటలు నేర్పాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో భవిత కేంద్రాలను మూసేసి, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేశారు. జిల్లాలో చాలా పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకే సరైన మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతుంటే... తాజాగా బుద్ధిమాంద్య పిల్లల కోసం ప్రత్యేకంగా గది కేటాయించడం హెచ్ఎంలకు పెద్ద చిక్కు తెచ్చిపెట్టింది. దీంతో తరగతి గదుల్లోనే బెంచీల మధ్య స్థలం కేటాయించి చేతులు దులుపుకున్నారు. ఈ క్రమంలో బుద్ధిమాంద్య పిల్లలను చూస్తూ సాధారణ విద్యార్థులు గేలి చేయడం మొదలు పెట్టారు. అక్కడితో ఆగకుండా ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలు బోధిస్తున్న సమయంలో సాధారణ విద్యార్థుల దృష్టి మొత్తం ఆటపాటల్లో నిమగ్నమైన బుద్ధిమాంద్య పిల్లలపైనే నిమగ్నమవుతోంది.


పుట్టపర్తిలో మూత పడిన భవిత కేంద్రం


ప్రస్తుతం ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో బెంచీల మధ్యలోనే శిక్షణ పొందుతున్న దృశ్యం

జిల్లాలో 3,056 మంది పిల్లలు..

జిల్లాలోని 32 భవిత కేంద్రాల్లో మొత్తం 3,056 మంది బుద్ధిమాంద్య పిల్లలు ఉన్నారు. వీరి కోసం పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం, మడకశిర, పెనుకొండ, కదిరి, రాప్తాడు తదతర ప్రాంతాల్లో ఏర్పాటైన భవిత కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించి ఇచ్చారు. ప్రస్తుతం వీటిని విద్యాశాఖ స్టోర్ రూంగా మార్చేసింది.

భవిత కేంద్రాలను అందుబాటులోకి తేవాలి



మూత పడిన భవిత కేంద్రాలను ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రతి వారం, ప్రతి నెలా దివ్యాంగ చిన్నారులకు ఇచ్చే ఫిజియోథెరపికి, ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం, ఆటిజం డే, అంధుల దినోత్సవం వంటి కార్యక్రమాలను సదరు భవనాల్లోనే చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు భవిత కేంద్రాల్లో చిన్నారులు ఆడుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన ఆటవస్తువులు, చార్ట్‌లు, ఫిజియోథెరఫి పరికరాలు, నడక నేర్పడానికి అవసరమైన పరికరాలు అమర్చారు. ప్రస్తుతం భవిత కేంద్రాలను స్టోర్‌రూంగా మార్చేయడంతో ఆయా పరికరాలన్నీ పాడైపోయే అవకాశముంది. దీనిపై ప్రభుత్వం స్పందించాలి.

– ఆనందబాబు, ఐఈఆర్టీ

విద్యుత్ బిల్లులు ఇలా చెల్లించండి

మీ కోసం

అనంతపురం టౌన్: విద్యుత్ బిల్లుల చెల్లింపులో ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక విధానానికి శ్రీకారం చుట్టింది. గతంలో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేవారు. తాజాగా విద్యుత్ బిల్లులను నేరుగా విద్యుత్ సంస్థ డిస్కమ్‌లకు చేరేలా ప్రత్యేక యాప్‌ను ఏపీఎస్పీడీఎల్ రూపొందించింది. దీంతో చాలా మంది విద్యుత్ వినియోగదారులకు బిల్లులు ఆన్‌లైన్‌లో ఎలా చెల్లించాలో తెలియక విద్యుత్ బిల్లులు కట్టేందుకు కౌంటర్ల వద్ద బారులు తీరుతన్నారు.

చెల్లింపులు సులువే..

- ముందుగా మన స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని ఫోన్ బిల్లు చెల్లించవచ్చు.
- క్రోమ్ బ్రౌజర్‌ను ఓపెన్ చేసి https://www.apspdcl.in/digital&payment.jsp వెబ్‌సైట్‌లోకి వెళితే బిల్ డెస్క్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. దీనిని క్లిక్ చేసి సర్వీస్ నంబర్ నమోదు చేసి, దాని కింద క్యాప్చర్ నంబర్ టైప్ చేసి ఎంటర్ చేయగానే మన విద్యుత్ బిల్లు కనిపిస్తుంది. దీనిని నిర్ధారించుకున్న తర్వాత సబ్‌మిట్ కొడితే వెంటనే ఫోన్ పే, గూగుల్‌పే ఆప్షన్‌లు కనిపిస్తాయి. వీటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకుంటే సంబంధిత యాప్‌లో బిల్లు కనిపిస్తుంది. అక్కడ నగదు బదిలీకి సంబంధించిన పాస్‌వర్డ్ టైప్ చేసి ఒకే చేస్తే వెంటనే పే మెంట్ సక్సెస్ అవుతుంది. ఈ పేమెంట్ రసీదును పీడీఎఫ్‌లో డౌన్‌లోడు చేసి పెట్టుకోవచ్చు.

అటవీశాఖలో ప్రమోషన్లు

అనంతపురం సెంట్రల్: అటవీశాఖలో పనిచేస్తున్న ముగ్గురు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు డీఎఫ్ఓ వినీత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాయలచెరువు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ మంజులవాణిని పెనుకొండ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా, కదిరి రేంజ్‌లోని చారుపల్లి అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ రేణుకను చామలగొంది బీట్ ఆఫీసర్‌గా, శెట్టూరు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ తిమ్మక్కను అక్కడే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిమర్రి: మండలంలోని పిన్నదరి గ్రామ సమీపంలో పేకాట ఆడుతూ పది మంది పట్టుపడినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం ఉదయం పిన్నదరి గ్రామ సమీపంలోని పొలాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో 10 మంది జూదరులు పట్టుపడ్డారు. వీరి నుంచి రూ.39,390 నగదు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల ధర్నా


నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

ధర్మవరం అర్బన్: సచివాలయ శానిటేషన్ సెక్రటరీ నాగరాజు విధులకు 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చాడని ధర్మవరం మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ సస్పెండ్ చేశారు. దీంతో కమిషనర్ తీరును నిరసిస్తూ సచివాలయ ఉద్యోగులు శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌ను ముట్టడించి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. నాగరాజును సస్పెండ్ చేయాలనుకుంటే మొదట నోటీసులు ఇచ్చి అనంతరం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మార్కెట్‌లోని కార్యాలయ మస్టర్‌లో నాగరాజు సంతకం చేసి తిరిగి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయానికి చేరుకోవాలంటే కనీసం 15 నిమిషాలు సమయం పడుతుందని వివరించారు. కనీస సదుపాయాలు లేని వార్డుల్లో క్షణం తీరిక లేకుండా పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులను అభినందించాల్సింది పోయి... సస్పెన్షన్ వేటు వేయడం పరోక్షంగా ఉద్యోగుల ఆత్మస్థైరాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. నాలుగు రోజులైనా చెత్త సేకరణకు వాహనాలు పంపకపోతే వార్డుల పరిశుభ్రత ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. సమస్యలన్నీ కమిషనర్ వైపు పెట్టుకుని ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు దిగడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా కమిషనర్ మానవత్వంతో ఆలోచించి సస్పెన్షన్‌ను తొలగించాలని కోరారు. కాగా, సస్పెన్షన్‌ను తొలగించే ప్రసక్తే లేదని. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ దురుసుగా వ్యవహరించడంతో సచివాలయ ఉద్యోగులు నివ్వెరపోయారు.

తండాల్లో మౌలిక వసతులు కల్పించండి


కలెక్టర్ చేతన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వడిత్యా శంకర్‌నాయక్

పుట్టపర్తి అర్బన్/టౌన్: గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ చేతన్‌కు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకరనాయక్ విన్నవించారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలెక్టర్‌ను శుక్రవారం ఆయన మర్యాద పూర్వకంగా కలసి మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... జిల్లాలోని ప్రతి తండాకూ రోడ్డు సౌకర్యం కల్పించడంతో పాటు ఆర్టీసీ బస్సు నడిచేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. జల్‌జీవన్ మిషన్ కింద మంచినీటి సరఫరా చేయాలని, విద్యార్థుల కోసం ప్రతి మేజర్ తండాలో లైబ్రరీ ఏర్పాటు చేయించాలని, గ్రూప్స్, సివిల్స్ తదితర పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న గిరిజన విద్యార్థులకు మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని విన్నవించానన్నారు. తండాలలో శ్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట మల్లికార్జుననాయక్, ఎస్‌ఓ శ్రీనివాస నాయక్, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రామ్ తదితరులు ఉన్నారు.

ఎస్పీని కలసిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు

జిల్లా ఎస్పీ వి.రత్నను రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ శుక్రవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఈ సందర్భంగా ఎస్పీకి ఆయన విన్నవించారు.

కొడిగెనహళ్లి వద్ద మహిళ మృతదేహం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి సమీపంలోని నీటి కుంటలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సత్యనారాయణ అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్‌ఐ సత్యనారాయణ... రెవెన్యూ అధికారుల సమక్షంలో మహిళ మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. శరీరం మొత్తం ఉబ్బి పోయి ఉంది. గ్రీన్ కలర్ స్వెట్టర్, చిలకపచ్చ రంగు లంగా ధరించి ఉంది. దాదాపు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుంది. మృతదేహం లభ్యమైన నీటి కుంట హిందూపురానికి సమీపంలో ఉండడంతో ఆ ప్రాంతానికి చెందిన వారై ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

దళిత మహిళలపై దాడి కేసులో పోలీసుల ఏకపక్ష వైఖరి

- అన్యాయాన్ని ప్రశ్నిస్తూ బాధితులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు

ధర్మవరం: స్థానిక టూటౌన్ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించారు. పట్టణంలోని 34వ వార్డులో దళిత వర్గానికి చెందిన పద్మ, కల్పనపై టీడీపీ నాయకుల దాడి ఘటన విషయంలో బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి ఫిర్యాదుదారులతో పాటు వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమంగా కేసు నమోదు చేశారు. సోమవారం లక్ష్మీనగర్ బండగుంత వద్ద పద్మ, కల్పనపై టీడీపీ నాయకులు ముత్యూరు బీబీ, నాగూరు హుస్సేన్ అకారణంగా దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దౌర్జన్యాన్ని ఖండించిన వైఎస్సార్‌సీపీ 24వవార్డు కౌన్సిలర్ బాలం ఓబుళమ్మ, ఆమె భర్త బాలంగోపాల్‌తో పాటు బాధిత మహిళలపై పోలీసులు 324 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలియగానే పట్టణ ప్రజలు ఒక్కసారిగా విస్తుపోయారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తూ బాధితులకు అండగా నిలిస్తే కేసులు బనాయించడం దారుణమని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదులో వాస్తవాలు నిర్ధారించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసుల వైఖరిని తప్పుబట్టారు. తక్షణమే బాధితులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులపై బనాయించిన కేసులు ఎత్తివేయాలని ఎత్తివేయాలని, లేకుంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

తప్పు కప్పిపుచ్చుకునేందుకు పాట్లు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: శ్రీసత్యసాయి జిల్లా సమగ్రశిక్ష ఏజీసీడీఓగా పని చేసి రిలీవ్ అయిన ఎం.శివమాధవికి పోస్టింగ్ ఇచ్చే విషయంలో అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఉభయ జిల్లాల విద్యాశాఖ అధికారుల అశాస్త్రీయ నిర్ణయాలతో ఓ సామాన్య టీచరు రెన్నెళ్లుగా పడుతున్న ఇబ్బందులపై 'ఉపాధ్యాయురాలి విధులతో రెండు జిల్లాల డీఈఓల చెలగాటం' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై విద్యాశాఖ కమిషనర్‌తో పాటు రెండు జిల్లాల కలెక్టర్లు స్పందించారు. దీంతో ఉలిక్కిపడిన విద్యాశాఖ అధికారులు తమ తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకు నానాపాట్లు పడ్డారు. ఈ క్రమంలో రీజాయిండరీ తప్పుల తడకగా పంపారు. ఏజీడీసీఓగా పని చేసిన శివమాధవిని జీసీడీఓగా పని చేసిందంటూ స్వయంగా డీఈఓ పేరుతో పంపడం చూస్తుంటే వారి నిర్లక్ష్యం ఎంత మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే శివమాధవికి పోస్టింగ్ ఇవ్వాలంటూ తాము జూన్ 12న ఒకసారి, 27న రెండోసారి పూర్వపు జిల్లా డీఈఓకు లేఖ రాశామంటూ శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ మీనాక్షి తెలిపారు. మరి రెండుసార్లు లేఖలు పంపినా ఇన్ని రోజులూ ఎందుకు పట్టించుకోలేదో అనంతపురం డీఈఓ వివరణ ఇవ్వలేదు.

మరో తప్పిదానికి తెర లేపిన అధికారులు

చేసిన తప్పును కప్పి పుచ్చుకునేందుకు అనంతపురం డీఈఓ అధికారులు మరో తప్పిదానికి తెరలేపారు. పత్రికలో వెలువడిన కథనంపై ఉన్నతాధికారులు వివరణ అడిగేసరికి పక్కా ప్రణాళికతో ముందు రోజు తేదీ వేసి ఉత్తర్వులు సిద్ధం చేశారు. నేడో... రేపో శివమాధవికి పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వనున్నట్లు డీఈఓ కార్యాలయ సిబ్బంది తెలిపారు. శుక్రవారం ఉదయం 'సాక్షి'తో డీఈఓ కార్యాలయ అధికారులు మాట్లాడారు. అయితే శుక్రవారం సాయంత్రానికే పాత తేదీ వేసి ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నేకొత్తపల్లి మండలం హరియాన్‌చెరువు జెడ్పీహెచ్ఎస్‌కు శివమాధవిని కేటాయిస్తూ ఈ నెల 25నే (గురువారం) ఉత్తర్వులు ఇచ్చినట్లుగా రికార్డులు సృష్టించారు. ఈ విషయం డీఈఓ కార్యాలయం గడప దాటలేదు. బాధిత టీచరుకు కనీసం ఫోన్‌లో కూడా సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

ఆదాయంలో అగ్రగామిగా నిలుద్దాం : డీపీటీఓ


మాట్లాతున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: ప్రజారవాణాశాఖలోని ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేసి ఆదాయం పెంపులో రాష్ట్రంలోనే జిల్లాను అగ్రగామిగా నిలపాలని జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్ పిలుపునిచ్చారు. శుక్రవారం పుట్టపర్తిలో తన కార్యాలయంలో జిల్లాలోని అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ పర్సన్స్, అకౌంట్ సూపర్‌వైజర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. జిల్లాలో ప్రతి డిపో నుంచి ఆదాయం పెంపునకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు. బస్సు రూట్ వెళ్లకముందే పనితీరు పరీక్షించాలన్నారు. పనితీరు బాగా లేకపోతే సర్వీసు రీషెడ్యూల్ చేయాలన్నారు. ప్రయాణికుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కేఎంపీఎల్ పెంచడంతో పాటు వేగం తగ్గించి ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. శ్రావణమాసం పురస్కరించుకుని పాలపాటిదిన్నె, మురడి, నేమకల్లు, కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు.

మెరుగైన వైద్య సేవలందాలి

- సబ్ కలెక్టర్ అపూర్వభరత్


ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వభరత్

హిందూపురం టౌన్: స్థానిక ప్రభుత్వ జిల్లాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆస్పత్రి అభివృద్ధి తాత్కాలిక కమిటీ చైర్మన్, పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ ఆదేశించారు. కొన్ని రోజుల క్రితం కలెక్టర్ చేతన్ చేపట్టిన తనిఖీల్లో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ లేకపోవడాన్ని గుర్తించారు. ఈ క్రమంలో వెంటనే తాత్కాలిక కమిటీని ప్రకటించి చైర్మన్‌గా సబ్‌కలెక్టర్, కన్వీనర్‌గా డీసీహెచ్ఎస్, సభ్యులుగా జిల్లా ఆడిట్ అధికారి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కో–ఆర్డినేటర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం డీసీహెచ్ఎస్ తిపేంద్రనాయక్‌తో కలసి ఆస్పత్రిని సబ్‌కలెక్టర్ తనిఖీ చేశారు. మందుల విభాగంతో పాటు పలు వార్డులను పరిశీలించారు. రోజు వారీ ఓపీపై ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్‌తో ఆరా తీశారు. మందుల నిల్వలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాస్పత్రిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. చిన్నపాటి పనులను అభివృద్ధి కమిటీ నిధులతో చేపట్టాలని ఆదేశించామన్నారు. పిచ్చి మొక్కల తొలగింపు, పారిశుధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఆఫ్తాబ్, నందిత, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు భక్తిభావం చాటాలి

- విగ్రహాల ఎత్తు 18 అడుగులు మించరాదు
- సౌండ్స్ సిస్టంను అనుమతించబోం
- పీస్ కమిటీ సమావేశంలో ఎస్పీ వి.రత్న


మాట్లాడుతున్న ఎస్పీ రత్న, పాల్గొన్న డీఎస్పీ, కమిషనర్, ట్రాన్స్‌కో ఏఈ తదితరులు

హిందూపురం: భక్తి భావం చాటేలా వినాయక చవితి, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందుకు వినాయక మంటపాల నిర్వాహకులంతా సహకరించాలని ఎస్పీ వి.రత్న కోరారు. శుక్రవారం రైల్వేరోడ్డులోని కేవీఆర్ ఫంక్షన్ హాలులో వినాయక మంటపాల నిర్వాహకులతో పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్పీ రత్న, డీఎస్పీ కంజాక్షన్, ట్రాన్స్‌కో ఏఈ ఝన్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హిందూపురాన్ని శాంతిపురంగా చూద్దామన్నారు. హైదరాబాద్‌లా గొప్పగా వినాయక చవితి, నిమజ్జనం జరుపుకుందామని పిలుపునిచ్చారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఏటా ఎదుర్కొనే సమస్యలు గుర్తించి విగ్రహాల ఎత్తు 18 అడుగులకు మించకుండా చూడాలన్నారు. అలాగే చెవులు చిల్లులు పడేలా డీజేలు, సౌండ్స్ వద్దన్నారు. నిర్దేశించిన మార్గంలోనే గణేష్ శోభయాత్ర సాగాలన్నారు. శోభయాత్ర సమయంలోనూ కరెంట్ సరఫరాకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం నిర్వాహకులు, పట్టణ ప్రముఖులు తమ సందేహాలు, సూచనలు అధికారులకు వివరించారు.

బార్డర్ చెక్‌పోస్టుల్లో నిరంతర నిఘా..

హిందూపురం అర్బన్: కర్ణాటక సరిహద్దు చెక్ పోస్టుల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వి.రత్న ఆదేశించారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలన్నారు. శుక్రవారం రాత్రి ఆమె పట్టణంలోని వన్‌టౌన్, టూటౌన్, అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి స్టేషన్‌లోనూ లాకప్ గదులు, రిసెప్షన్ కౌంటర్లను పరిశీలించారు. సిబ్బంది విధులపై ఆరా తీశారు. అన్ని స్టేషన్ల పరిధిలోనూ పెండింగ్ కేసులపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ కంజాక్షన్, సీఐలు ఏ.శ్రీనివాసులు, వి. శ్రీనివాసులు, ఈరన్న, ఎస్ఐలు ఉన్నారు.